

# మనసుంటే...

శ్రీపాద స్వాతి

# మనసుంటే ....

శ్రీపాద స్వాతి

© Author
© Sripada Swatee
This digital book is published by -
కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.
సర్వ హక్కులూ రక్షించబడ్డాయి.

All rights reserved.

No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.

# మనసుంటే ....

## 1

ఎవరూ పెద్దగా మాట్లాడుకోవడం లేదు.

అలాగని ఇల్లు నిశ్శబ్దంగానూ లేదు.

లో స్వరంలో వినీ వినిపించని చర్చలు సాగుతూనేవున్నాయి.

"ఎవరెవరికి టీ కావాలి? " వంటగది గుమ్మంలో నించుని అడిగింది అపరంజి.

హాల్లో కూర్చుని గోరుచిక్కుళ్ళు తుంపుతున్న మాలతి, మాలిని, క్యాబేజీ కోస్తున్న సునంద పనిమనిషికి వాషింగ్ మెషీన్‌లో బట్టలు వెయ్యడానికి సాయపడుతున్న స్వయంప్రభ, వరండాలో శంకర్ ,వినోద్, సత్యమూర్తి అందరూ విన్నారు. కాని ఒక్కరూ కావాలని కాని, వద్దని కాని అనలేదు. ఒక్క క్షణం ఆగి,

" సరే, అందరికీ చెప్పేస్తాను "

ప్రతిస్పందన ఆశించకుండా వంటగదిలోకి వెళ్ళి వంట మనిషికి సూచనలివ్వడం ఆరంభించింది.

" ఈ స్టౌమీద టీనీళ్ళు పెట్టి ఆ పక్కన ఇడ్లీ పెట్టెయ్యండి. ఈ లోగా చట్నీ మిక్సీలో వెయ్యొచ్చు"

ఏ గదిలో చూసినా సూట్ కేస్‌లూ బాగ్‌లూ ... ఆ మూలో ఈ మూలో గుంపులు గుంపులుగా జనం.

నిజమే.

వర్ధనమ్మ మహాభినిష్క్రమణ పెద్ద ఎదురు చూడని సంఘటనేమీ కాదు.

ఎనభై దాటిన ఆవిడ మూడేళ్ళుగా మంచం మీదే వుంది. చివరకు ఎదురు చూసిన ఘడియ వచ్చి ఆవిడ వెళ్ళిపోయింది.

అందరూ వచ్చాక క్రితం సాయంత్రం అంత్యక్రియలు ముగిసాయి. ఇంటికి తిరిగి వచ్చాక కాస్త తిని పడుకుని తెల్లారి నిద్ర లేచి తప్పని కార్యక్రమాల్లో మునిగిపోయినా అందరికీ మనసింకా భారంగానేవుంది.

నిన్నటి వరకు సజీవంగా వున్న మనిషి ఇప్పుడు లేకపోవడం .... ఆ ఖాళీ పూర్తిగా కుదిపేసిన వ్యక్తి అనసూయ. అవును అనసూయకే తల్లితో ఎక్కువ అనుబంధం.

పుట్టినప్పటినుండీ నిన్నటి వరకూ తల్లిని విడిచి ఒక్కరోజు గడపలేదు. అందులోనూ గత ఏడెనిమిదేళ్ళుగా ఇంట్లో ఇద్దరేమిగిలి ఒకరికొకరుగా మారాక, ఇరవై నాలుగ్గంటలూ సన్నిహితంగా గడిపాక ............

"అనూ ...అనూ...."

వంటింటి లోంచి పిలిచింది అపరంజి.

ఊహు! పిలుపుకి జవాబే లేదు.

అప్పటి దాకా అనూ గుర్తురాలేదెవరికీ. కనుచూపు మేరలో ఎక్కడా కనిపించలేదు.

" అమ్మ గదిలో వుందేమో" మాలతి సూచన

అపరంజి గబగబా తల్లి గదిలోకి వెళ్ళింది.

"అనూ"

కిటికీ దగ్గర నిల్చుని బయటకు చూస్తున్న అనసూయ నిర్లిప్తంగా తల తిప్పింది.

ఇకపైన జీవితం ఏ అనుకోని మలుపు తిరుగుతుందో తెలీని అయోమయంలో వుంది అనసూయ.

అదే ఆమె మొహం లోనూ కనిపించిందేమో అపరంజి గబగబా వెళ్ళి ఆమె భుజం మీద చెయ్యి వేసి దగ్గరకు లాక్కుంటూ,

" బెంగపడుతున్నావా అనూ?"

"................."

" ఒక్క దానవని దిగులు పడుతున్నావేమో మేం అందరం ఉన్నామని మరచిపోకు...."

ఫక్కున నవ్వాలనిపించింది అనసూయకు.

ఆ మెరుపు పెదవులమీదకు పాకినట్టుంది

"ఎందుకు నవ్వుతున్నావు? అపరంజి అనుమానంగా అడిగింది.

"అబ్బే"

"చెప్పు"

"నువ్వు ఎన్ని సార్లు ఇక్కడ్నించి పారిపోదామనివుందని అన్నావో గుర్తొచ్చి"

" నేనా? ఎప్పుడు?"

అనసూయకు మళ్ళీ నవ్వు తన్నుకు వచ్చింది.

అపరంజి ఆమెకన్నా పన్నెండేళ్ళు పెద్ద కాని తన కన్న ఓ పాతికేళ్ళు చిన్నదేమో అనిపించిందా క్షణంలో.

"రా... అందరిలో వుండాలి కాని ఇలా ఒంటిగా వుంటే మరీ దిగులనిపిస్తుంది. సుగుణమ్మను టీ చెయ్యమన్నాను. ........"

అపరంజితో బయటకు కదిలినా అనసూయ కళ్ళు ఖాళీ గావున్న తల్లి మంచాన్నీ , బోసిపోయిన గదిని ఆర్తిగా తడిమాయి.

ఎంత డిస్పోజబుల్ గ్లాస్లూ ప్లేట్‌లూ వాడినా, పనిమనిషినీ వంటమనిషినీ మాట్లాడుకున్నా ఇల్లంతా ఒకటే హడావిడి.

నిశ్శబ్ద వాతావరణానికి అలవాటు పడ్డ అనసూయకు ఆ సందడి కొంచం విసుగ్గానేవుంది.

అలాగని ఆ విసుగును వెల్లడించలేని స్థితి.

నాలుగు రోజులు కళ్ళు మూసుకుంటే .............

టీలు , ఫలహారాలు... మళ్ళీ వంట ప్రయత్నాలు...

వీటన్నింటి మధ్యా చర్చలు.

"ఏం చెయ్యాలి? జరగ వలసినది ఏమిటి?"

"కర్మ కాండ మూడో రోజున మొదలెట్టాలి. దానికి కావలసిన అరేంజ్‌మెంట్స్ ... ముందుగా చేయించేవాళ్ళు, దానిక్కావలసిన వస్తువులు అన్నీ అమర్చుకోవాలి .." పాతికేళ్ళ క్రితమే అమెరికా వెళ్ళీ చదువుకుని అక్కడే స్థిరపడిన మాలతి మాటలవి.

అనసూయకు నవ్వొచ్చింది. ఎలెక్ట్రికల్ క్రిమెటోరియమ్‌లో దహనం చేసి ఇంకా ఇరవై నాలుగు గంటలైనా కాలేదు.

" అమ్మ కిలాంటి నమ్మకాలు లేవని నీకు తెలీదా పెద్దక్కా? అవునులే, అమ్మతో నీకంత టచ్ ఎక్కడ.........అమ్మ చాలా సార్లు చెప్పింది.

ఇలాంటివన్నీ నేను నమ్మను. నేను లేను కదా అని మీ పిచ్చి నమ్మకాలు నామీద రుద్ది గందరగోళం చెయ్యవద్దని... "

ఓ పక్కన తనపని తను చేస్తూనే స్వయంప్రభ జవాబిచ్చింది.

"అవుననుకో.. అయినా నలుగురూ ఏమనుకుంటారు ? ఇంతమంది వెల్ సెటిల్డ్ పిల్లలూ మనవలూ వుండి.......... "

అనుకోని విధంగా ఎప్పుడూ నిశ్శబ్దంగా వుండే మాలిని తీవ్రంగా స్పందించింది.

" అవునే, పుట్టిందగ్గరనుంచి చచ్చాక కూడా మన ఇష్టాఇష్టాల ప్రసక్తి వదిలేసుకుని ఎవరేమనుకుంటారోననే బతకాలా...... నీ కొడుకు అమెరికన్‌ని పెళ్ళి చేసుకున్నాక కూడా నువ్విలా ఎలాగన్నావో నాకర్థం కావడం లేదే పెద్దక్కా?"

"బాగా చెప్పావే చిన్నక్కా! అయినా అమ్మ తృప్తి కావాలిగాని... ఇలా పిచ్చి పిచ్చి నమ్మకాలకు ఖర్చుపెట్టడం కాదుగా....." నయా పైసకు పదిముళ్ళు వేసే సునంద కల్పించుకుంది.

"మేమిప్పుడు ఖర్చు డబ్బు గురించి మాట్లాడటం లేదు సునందా... ఏం చెయ్యాలని ఆలోచిస్తున్నాం. కార్యక్రమాలు చెయ్యనంత మాత్రాన అమ్మ పేరిట ఏదైనా చెయ్యకూడదా?"

"ఎలాగూ ముందు అమ్మ పేరిట అన్నదానం అదీ బీదా బిక్కికి. ఆ పైన మిగతావి ఆలోచిద్దాం.." అపరంజి నిర్ణయించినట్టుగా చెప్పింది.

" పోనీ ఎవరినైనా సంప్రదిస్తే..."

మాలతి మరో మారు ప్రయత్నించింది.

"అక్కయ్యా! నీ వయసు అరవైకి చేరువవుతున్నా, జీవితమంతా అమెరికాలో గడిపినా, ఇంకా నీలో అభ్యుదయం కొంచం కూడా రాలేదు. ఇది అమ్మకు మనకు సంబంధించినది. ఎవర్నో సంప్రదించడం అనవసరం" మాలిని అందుకుంది మళ్ళీ .

"అనసూయా నువ్వేమంటావు ?"

అపరంజి హఠాత్తుగా అడిగింది.

"అమ్మ జ్ఞాపకాలు మనసుల్లో నిక్షిప్త పరచుకోవడమేగా ఈ కార్యక్రమాల ఉద్దేశ్యం. అయినా నాన్న పోయి పదిహేనేళ్ళు దాటుతోంది. అయినా ఆయన తీపి గుర్తులు మన మనసులనించి రెక్కలు కట్టుకుని ఎగిరిపోయాయా? కాలం ఆగిపోయినట్టనిపించినా కదులుతూనే ఉంటుంది. ..."

"చెప్పు అనూ.."

" మీరందరూ ఎలాగంటే అలాగే......."

" మూడేళ్ళు అమ్మ ఎంత బాధ పడింది ? లేవలేని క్షణాలు , ఊపిరందని యుగాలు , పక్కకు కూడా ఒత్తిగిలలేని నిస్సహాయత .............." అనసూయ ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ ,,,,,,,,

" అయిదో రోజున అమ్మ పేరిట బీదలకు అన్నదానం .... ఆ పైన మిగతావి ఆలోచిద్దాం" నిశ్చయంగా తేల్చేసింది అపరంజి.

***

# 2

అనసూయ అంతరంగం

అప్పుడే అందరూ వెళ్ళిపోయి వారం దాటి పోయింది.

చివరిగా వెళ్ళినది అపరంజి.

పెద్దక్కకూ నాకూ తేడా పాతికేళ్ళ పైమాటే.

అక్కతో నాకు అంతగా చనువులేదు.

నాకు పూర్తిగా ఊహ తెలియకముందే అక్క అమెరికా వెళ్ళిపోయింది. వెళ్ళడం చదువుకుందుకే అయినా చదువు పూర్తి కాకుం

డానే, ప్రేమలో పడటం, అదీ తమ వాళ్ళేనని తెలిసాకే సుమా__అమ్మ నాన్నల ఇష్టం తోటే పెళ్ళి జరగటం అయిపోయాయి. అప్పటికి నాకు రెండేళ్ళో మూడేళ్ళోనట.

నాన్నది మంచి హోదా గల ఉద్యోగమే ...

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1384**

* * *

Read other books of Swatee Sripada @

**http://kinige.com/kbrowse.php?via=author&name=Sripada+Swatee&id=127**